సాక్షి కామారెడ్డి

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



ఉన్నత స్థాయికి ఎదగాలి

విద్యార్థినులు చక్కగా చదివి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి సూచించారు.

- 8లో ▸



యూరియా కొరత లేదు

యాసంగిలో పంటల సాగుకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని డీఏవో భాగ్యలక్ష్మి తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

34.8 /19.2

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

మత్తులో యువత!

- సరదాగా మొదలై.. వ్యసనంగా మారుతున్న వైనం
- జిల్లాలో పెరుగుతున్న గంజాయి విక్రయాలు
- తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని సూచిస్తున్న పోలీసులు

గతనెల 14వ తేదీన జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి శివారులో ద్రవరూప గంజాయి డబ్బాలను విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు కొనుగోలు చేస్తున్న ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. గంజాయి కొనుగోలుదారులలో నలుగురు యువకులు కాగా ఒక బాలుడు ఉండడం గమనార్హం.

వారం క్రితం నాందేడ్‌నుంచి గంజాయిని రైలులో తీసుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు పంపారు. నిందితులంతా 19–21 ఏళ్లలోపు వారే.. ఇలా నిత్యం ఏదో ఒకచోట గంజాయి కేసులు వెలుగు చూస్తున్నాయి. చాలా కేసుల్లో గంజాయి అమ్ముతున్నవారు, వినియోగిస్తున్న వారిలో ఎక్కువగా యువకులే ఉంటున్నారు.

యువత మత్తుకు బానిసగా మారుతోంది. మొదట సరదాగా ప్రారంభమైన అలవాటు క్రమంగా వ్యసనంగా మారి జీవితాన్ని బలితీసుకుంటోంది. యువతతోపాటు మైనర్లూ గంజాయికి అలవాటుపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. తల్లిదండ్రులు మేల్కొని పిల్లల కదలికపై నిఘా పెట్టకపోతే వారి భవిత అంధకారంగా మారే ప్రమాదం ఉంది.

కామారెడ్డి క్రైం: తల్లిదండ్రులకు తమ పిల్లలపై అపార నమ్మకం ఉంటుంది. తమ పిల్లలకు ఎలాంటి దురలవాట్లు ఉండవని, బాగా చదువుకుంటారని చెబుతుంటారు. అదే నమ్మకంతో వారికి స్వేచ్ఛ ఇస్తుంటారు. దీనిని కొంతమంది పిల్లలు దుర్వినియోగం చేస్తున్నారు. స్నేహితుల ప్రోత్సాహంతో దురలవాట్లకు ఆకర్షితులవుతున్నారు. దీనికి తోడు ఇటీవలి కాలంలో ఉద్యోగాలు, పని ఒత్తిడులతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. దీంతో వారి ప్రవర్తనలో వచ్చే మార్పులపై అంతగా దృష్టి సారించడం లేదు. ఫలితంగా పిల్లలు చెడు స్నేహాల వల్ల వక్రమార్గం పడుతున్నారు. మద్యం, సిగరెట్, గంజాయి సేవనాలకు అలవాటుపడుతున్నారు.

విస్తరిస్తున్న విష సంస్కృతి

జిల్లాలో గంజాయి సేవనం అనే విష సంస్కృతి క్రమంగా విస్తరిస్తోంది. సరదా పేరిట యువతలో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తూ వారిని క్రమంగా బానిసలుగా మార్చుకుంటోంది. గంజాయి రవాణా, విక్రయాలను అడ్డుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నా.. కొత్తకొత్త రూపాల్లో దందా కొనసాగుతూనే ఉంది. గతంలో గంజాయిని సిగరెట్ల రూపంలో సేవించేవారు. పెద్దపెద్ద పట్టణాలకే ఇది పరిమితమయ్యేది. ఈ దందాను క్యాష్ చేసుకోవడానికి కొంతమంది జిల్లాలకూ పాకించారు. పోలీసులు పట్టుకోకుండా ఉండడానికి వివిధ రూపాల్లో తరలిస్తున్నారు. ఇటీవల ద్రవరూపంలో ఉన్న గంజాయిని కామారెడ్డి రూరల్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. వైజాగ్ చుట్టుపక్కల ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ విధమైన గంజాయి ఆయిల్‌ను తయారు చేసి, ఇక్కడికి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సిగరెట్ ముందు భాగంలో గంజాయి లిక్విడ్‌ను అద్దుకుని సేవిస్తారని విచారణలో గుర్తించారు. ఈ కేసులో ఇద్దరు విక్రయదారులతో పాటు కొనుగోలుదారులైన ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడినవారిలో నలుగురు యువకులు కాగా.. ఒక బాలుడు కూడా ఉన్నాడు. జిల్లా కేంద్రంలోనే గంజాయి సేవనానికి అలవాటు పడ్డవారు వందల సంఖ్యలో ఉన్నారని తెలుస్తోంది. ఇందులో యువతే అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



పేరెంట్స్ దృష్టి సారించాలి..

గంజాయి సేవనం మండల కేంద్రాలకు కూడా విస్తరించడం ఆందోళన కలిగించే అంశం. ఒకసారి గంజాయికి అలవాటుపడిన వ్యక్తిని సాధారణ స్థితికి తీసుకురావడం చాలా కష్టమని వైద్యులు పేర్కొంటున్నారు. గంజాయి బారిన పడినవారి నిద్ర, ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు వస్తాయి. అతిగా నిద్రపోవడం, లేదంటే రాత్రంతా మెలకువతో ఉండటం చేస్తారు. కుటుంబసభ్యులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించకపోతే ఆరోగ్యం చెడిపోయి ఆస్పత్రుల పాలు కావాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఈ పరిస్థితిని నివారించడానికి కుటుంబ సభ్యులు తమ పిల్లలపై నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. రోజూ కొంత సమయాన్ని కేటాయించి వారితో గడపాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. పిల్లల అలవాట్లు, దినచర్య, విద్యాభ్యాసం సాగుతున్న తీరు తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు పోలీసులు.

విపరీత పరిణామాలు..



గంజాయికి బానిస అవుతున్న కేసుల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు క్రమంగా బానిసను చేసుకుంటుంది. గంజాయి తీసుకున్న 2 గంటల తర్వాత కళ్లు ఎరుపెక్కడం, గొంతు తడి ఆరిపోవడం, అతి ఆకలి, గుండె వేగం పెరగడం జరుగుతాయి. అతి కోపం, విసుగు, తలనొప్పి, ఆందోళన కలుగుతాయి. ఇలాంటి వారు ఎక్కువగా ఒంటరిగా ఉంటారు. గంజాయితో విపరీత పరిణామాలు ఎదురవుతాయి. ఈ అలవాటును మాన్పించడానికి కౌన్సిలింగ్ అవసరం అవుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ దురలవాట్లకు లోను కాకుండా కాపాడుకోవాలి. – జి.రమణ, మానసిక ఆరోగ్య వైద్య నిపుణులు, కామారెడ్డి

వ్యసనాల బారిన పడకుండా చూడాలి



గంజాయి కేసుల్లో యువత ప్రమేయం ఎక్కువగా కనిపిస్తోంది. ఎంతో భవిష్యత్ ఉన్న యువత వ్యసనాల బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితిని నివారించడానికి తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ఓ కన్నేసి ఉంచాలి. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సరఫరాను కట్టడి చేయడానికి పోలీసు శాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నాం.

– ఆర్.ప్రకాష్, డీఎస్పీ, కామారెడ్డి

న్యూస్‌రీల్

బయోసైన్స్ జిల్లా ఫోరం ఏర్పాటు



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాలలో మంగళవారం బయోసైన్స్ జిల్లా ఫోరం సమావేశం నిర్వహించారు. ఇందులో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణాకర్‌రావు, కోశాధికారిగా వడ్ల సురేష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుధారాణి ఎన్నికయ్యారు. ఫోరం ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, చిన్నస్వామి, ఊర్మిళ, మహేష్, సత్యనారాయణ, హన్మంతురెడ్డి, నర్సింహాచారి, శ్రీరాం, గంగాధర్, కార్యదర్శులుగా రాజు, శ్రీధర్, మల్లేష్, రాజేశ్వర్, శరత్, రమేష్, సలహాదారులుగా భగత్, మాధురి, పద్మజ, వీరయ్య, యాదగౌడ్, జస్వంత్‌రావు, దశరథ్, మురికి సంతోష్ ఎన్నికయ్యారని ఫోరం ప్రతినిధులు తెలిపారు.

‘దరఖాస్తు గడువు పొడిగింపు’

కామారెడ్డి అర్బన్: మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం గడువును ఈనెల 15 వరకు పొడిగించారని మైనారిటీ విద్యాసంస్థల ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమన్వయకర్త బషీర్‌సాహెబ్ తెలిపారు. మంగళవారం ఆయన దేవునిపల్లి వాసవీకాలనీలోని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో ఆరు పాఠశాలలు, ఆరు జూనియర్ కళాశాలలున్నాయని, ఇందులో రెండేసి చొప్పున బాలికల విద్యాసంస్థలున్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ వెబ్‌సైట్ ద్వారా లేదా నేరుగా ఆయా పాఠశాలలు, కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వీగిపోయిన అవిశ్వాసం



లింగంపేట: శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్ సుకన్య, వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డిలపై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై 10 మంది డైరెక్టర్లు 15 రోజుల క్రితం డీసీవోకు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డీసీవో శ్రీనివాస్ మంగళవారం సొసైటీకి వచ్చి అవిశ్వాసంపై బలపరీక్షకు ఏర్పాట్లు చేశారు. మొత్తం 13 మంది డైరెక్టర్లలో తొమ్మిది మంది మద్దతిస్తేనే అవిశ్వాసం నెగ్గుతుంది. కానీ బలపరీక్షకు ఏడుగురు మాత్రమే వచ్చారు. దీంతో అవిశ్వాసం వీగిపోయినట్లు డీసీవో ప్రకటించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు భూమయ్య, ప్రశాంత్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

నిజామాబాద్ అర్బన్: నవోదయ ప్రవేశ పరీక్ష ఈనెల 10న నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన తెలిపారు. నవోదయలో తొమ్మిది, 11వ తరగతులలో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహించన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు 10వ తేదీన ఉదయం పదిన్నర గంటలకు సంబంధిత పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్ జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా చేరిన రజనిప్రియ విధులకు గైర్హాజరవుతుండడంతో ఆమెపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు మోహన్ ఫిర్యాదు మేరకు డీఈవో రాజు ఆమెను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఆమె హన్మాజీపేట్‌కు వచ్చారు. అయితే ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నాలుగు నెలలుగా పాఠశాలకు హాజరుకావడం లేదు. దీంతో విధులకు హాజరు కావాలని ప్రధానోపాధ్యాయుడు మోహన్ కోరగా.. తాను విధులకు రానని లెటర్ రాసి ఇచ్చారు. ఈ విషయాన్ని ఆయన డీఈవో దృష్టికి తీసుకువెళ్లగా సదరు ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్



కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణానికి చెందిన 21 వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ నేత తాటి లావణ్యతో పాటు ఆమె భర్త ప్రసాద్ మంగళవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉరుదొండ రవి, గోనె శ్రీనివాస్, లక్ష్మణ్, రవి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

ఎడపల్లి(బోధన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జానకంపేట్‌లో బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో గర్ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె గంగారెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. ఆయా పథకాలపై అవగాహన కల్పించి, ఏవిధంగా లబ్ధి పొందాలనే విషయాన్ని ప్రజలకు వివరించారు.

పల్లెల్లో పారిశుధ్యంపై ఫోకస్

- నేటి నుంచి వారం పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- పర్యవేక్షించనున్న మండల ప్రత్యేక అధికారులు

సాక్షి, కామారెడ్డి: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం పేరుతో బుధవారంనుంచి వారం రోజులపాటు అన్ని గ్రామాల్లో సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనుంది. పంచాయతీ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల పరిధిలో ని గ్రామాలు, అనుబంధ గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం ప్రారంభమయ్యే కార్యక్రమం 14 వ తేదీ వరకు కొనసాగుతుంది. గ్రామాల్లో పారిశుధ్య సమస్యల తో పాటు తాగునీటికి సంబంధించి ఇబ్బందులు ఉంటే వాటిని కూడా పరిష్కరించనున్నారు. స్పెషల్ డ్రైవ్‌ను మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తారు. 15న అన్ని గ్రామాల్లో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానిస్తారు. యువత దురలవాట్లకు గురికాకుండా ముఖ్యంగా డ్రగ్స్, మద్యం, గుట్కా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.

తాగునీటి సమస్య...

వేసవి సీజన్ ఆరంభానికి ముందే చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య వెన్నాడుతోంది. భూగర్భ జలమట్టం పడిపోతుండడంతో నీటి సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో తాగునీటి సమస్యనే ప్రధానంగా ముందుకు రానుంది. కొన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

ప్రత్యేకాధికారులకు సవాలే..

పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో ఇటీవలే ప్రత్యేకాధికారుల పాలన వచ్చింది. దీంతో కార్యక్రమం భారం మొత్తం ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు మోయాల్సి ఉంటుంది. కాగా పంచాయతీలను నిధుల సమస్య వెన్నాడుతోంది. దీంతో కార్యక్రమాలను ఎలా నిర్వహించాలని ప్రత్యేకాధికారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విషప్రయోగమా.. వశీకరణా?

- మహిళా శిశు వికాస కేంద్రం అధికారిణికి మందు కలిపి ఇచ్చే ప్రయత్నం
- స్కెచ్ వేసిన ప్రాంగణంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు



ఆర్మూర్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణం పెర్కిట్ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా అధికారిణి పద్మపై అక్కడే పని చేస్తున్న ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విష ప్రయోగ ప్రయత్నం విఫలమైంది.అయితే నిందితులు తాము విషప్రయోగం చేయలేదని వశీకరణ మందుఇచ్చే ప్రయత్నం చేశామని చెబుతున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

మహిళా ప్రాంగణంలో డే వాచ్‌మెన్‌గా అవుట్ సోర్సింగ్‌పై విధులు నిర్వహిస్తున్న సత్యమ్మను దొంగతనాలకు పాల్పడుతోందంటూ కేంద్రం అధికారిణి పద్మ విధుల్లో నుంచి తొలగించారు. కక్ష పెంచుకున్న సత్యమ్మ అక్కడే కుక్ అండ్ ఆయాగా విధులు నిర్వహిస్తున్న దివ్యాంగురాలైన అలివేలుకు మందు తీసుకొచ్చి ఇచ్చింది. అధికారిణి తినే అన్నంలో లేదా టీలో చక్కెరతో పాటు కలపాలని ఆమెకు సూచించింది. అలివేలు ప్రాంగణంలోని ఒక విద్యార్థిని సహాయంతో టీలో చక్కెరకు బదులు మందును కలపడానికి ప్రయత్నం చేసింది. ఇది గ్రహించిన విద్యార్థిని మరో ఉద్యోగి సహకారంతో అధికారిణి దృష్టికి తీసుకెళ్లడంతో వ్యవహారం బట్టబయలైంది. తనపై విష ప్రయోగానికి ప్రయత్నించారని సత్యమ్మ, అలివేలులపై తెలంగాణ మహిళ సహకార అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పద్మావతికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు

సత్యమ్మ, అలివేణిలను ఈ నెల 1న విధుల నుంచి తొలగించి పోలీసులకు ఫిర్యాదు చేసారు. అదే రోజు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోగా రవి కుమార్ బాధ్యతలు స్వీకరించడంతో ఎస్సై అంజమ్మను విచారణ కోసం ప్రాంగణానికి పంపించారు. ఈ ఘటనపై ఎస్సై అంజమ్మను సంప్రదించగా ఇంకా విచారణ జరుపుతున్నామని కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. మరోవైపు సత్యమ్మ స్థానికంగా ఉన్న పరిచయాలతో ప్రాంగణం అధికారిణిపై బెదిరింపులకు పాల్పడుతూ తమను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలంటూ ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ఈ విషయం తెలియడంతో ప్రాంగణం అధికారిణితో మాట్లాడటానికి బుధవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.


చోరీలకు పాల్పడుతున్నారనే..

ప్రాంగణంలో దొంగతనాల కు పాల్పడుతున్నారని గుర్తించి ఉన్నతాధికారుల సూచనలమేరకు సత్యమ్మను విధు ల్లో నుంచి తొలగించాము. కక్ష కట్టి ఆయాగా విధులు నిర్వహిస్తున్న అలివేలుతో కలిసి నాపై విష ప్రయోగం చేసే ప్రయత్నం చేసారు. పోలీసులకు ఫిర్యాదు చేసి వారం గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేరు.

– పద్మ, జిల్లా అధికారి, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం, పెర్కిట్

వృథాగా తాగునీటి పథకం

- పుష్కర కాలం క్రితం మంజీర ఒడ్డున నిర్మాణం
- రెండేళ్ల క్రితం చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్
- మరమ్మతులు చేయించని అధికారులు
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు



ఓపెన్ వెల్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

నాగిరెడ్డిపేట: గోలిలింగాల శివారులో దశాబ్దం క్రితం నిర్మించిన తాగునీటి పథకం అధికారుల నిర్లక్ష్యంతో రెండేళ్లుగా వృథాగా ఉంటోంది. అలంకారప్రాయంగా మారిన తాగునీటి పథకాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

గోలిలింగాల గ్రామశివారులోని మంజీర నది ఒడ్డున 2010లో రూ.9 కోట్లతో తాగునీటి పథక నిర్మాణం చేపట్టారు. పథకం పనులు కొనసాగుతున్న క్రమంలో అంచనా వ్యయం పెరగడంతో ప్రభుత్వం మరో రూ.4.60 కోట్లు మంజూరు చేసింది. తాగునీటి పథకం ఏర్పాటు కోసం మంజూరైన నిధులతో గోలిలింగాల శివారులోని మంజీరనదిలో ఓపెన్ వెల్‌తోపాటు నది ఒడ్డున ఇంటెక్‌వెల్‌ను నిర్మించారు. మాల్తుమ్మెద గేట్ వద్ద ఓవర్ హెడ్ రిజర్వ్(ఓహెచ్ఆర్) ట్యాంకును నిర్మించి అక్కడి నుంచి ఇంటెక్‌వెల్ వరకు పైప్‌లైన్ వేశారు. పథకం ప్రారంభించిన సమయంలో మండలంలోని అన్ని గ్రామాలతోపాటు లింగంపేట మండలంలోని 9 గ్రామాలకు తాగునీటిని అందించాలని నిర్ణయి పైపులైన్ కూడా వేశారు.

పేరుకుపోయిన కరెంట్ బిల్లులు..

గోలిలింగాల తాగునీటి పథకానికి సంబంధించి మంజీరనది ఒడ్డున ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం వేసవిలో కొన్నిరోజులపాటు తాగునీటి పథకాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి నాగిరెడ్డిపేట మండలంలోని కొన్నిగ్రామాలకు తాగునీటిని సరఫరా చేశారు. అనంతరం సింగూర్ ప్రాజెక్టు నుంచి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నాగిరెడ్డిపేట మండలంలోని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేశారు. అదే సమయంలో మంజీరనది ఒడ్డున ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. దీనికి తోడు తాగునీటి పథకానికి సంబంధించి రూ.15 లక్షల వరకు విద్యుత్ బిల్లులు పేరుకుపోయాయి. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించకుండా వదిలేయడంతో తాగునీటి పథకం నిరుపయోగంగా మారింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిషన్ భగీరథ పథకం ద్వారా మాత్రమే మండలానికి నీరు సరఫరా చేస్తున్నారు.

వేసవి సమీపిస్తుండడంతో..

సింగూర్ నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్‌లో ఎక్కడైనా లీకేజీ ఏర్పడితే తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. వేసవిలో సింగూర్ ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గినప్పుడూ నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. మిషన్ భగీరథ నీరు అందనప్పుడు ప్రజలు తాగునీటి సమస్యతో బాధపడే అవకాశాలున్నాయి. గోలిలింగాల తాగునీటి పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించి, అందుబాటులో ఉంచితే తాగునీటి సమస్య తలెత్తినప్పుడు దాని ద్వారా నీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరించవచ్చు. మరమ్మతులు చేయించడంతోపాటు విద్యుత్ బకాయిలను చెల్లించి తాగునీటి పథకాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- పట్టణ పోలీసులకు ఫిర్యాదు

కామారెడ్డి క్రైం: సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చి ఇందిరాగాంధీ చౌరస్తాలో దహనం చేశారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆందోళనలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పండ్ల రాజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గడుగుల శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, బాగయ్య, అన్వర్ అహ్మద్, రవీందర్‌గౌడ్, ప్రసాద్, సాయిబాబు, విజయ్ కుమార్‌రెడ్డి, ప్రతిభ రమేష్, సిద్దిఖ్, రఫీ, హైమద్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

ఉన్నతస్థాయికి ఎదగాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద ఉన్న మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వైబ్రేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకుంటూ భవిష్యత్‌లో రాణించాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, కామారెడ్డి మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు 11 బహుమతులు కైవసం చేసుకొన్నట్లు ప్రిన్సిపల్ రాధిక తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ అలివేలు, ఆయా గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



ఎల్లారెడ్డి: మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు ఈనెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సాయిబాబా అన్నారు. మండలంలోని సోమార్‌పేట్, ఎల్లారెడ్డి గూడెం పాఠశాల ఐదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హద్దులు ఏర్పాటు



కామారెడ్డి క్రైం: కామారెడ్డి రైల్వే స్టేషన్ నుంచి అడ్లూర్ రోడ్డులో ఉన్న రైల్వే లైన్ వెంబడి రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. అడ్లూర్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో రైల్వే మార్గం నుంచి 22 మీటర్ల దూరం వరకు కొలతలు చేపట్టి హద్దులను పకడ్బందీగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ ఇంజినీర్ నాగభూషణం చారి, జూనియర్ ఇంజినీర్ రవికుమార్, ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు.


కంకర క్వారీ అనుమతిని రద్దుచేయాలి



తాడ్వాయి: మండలంలోని అబ్దుల్‌నగర్ శివారులో కంకర క్వారీ అనుమతిని రద్దు చేయాలని బ్రహ్మాజివాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు. అబ్దుల్లానగర్ శివారులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడారు. కొందరు కంకర క్వారీ విస్తరణచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వాటికి అధికారులు అనుమతి ఇవ్వద్దని డిమాండ్ చేశారు. దుమ్ము పంట పొలాలపై పడడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు తెలిపారు.

అందెశ్రీకి దక్కిన గౌరవం

- రాష్ట్ర గీతంగా జయజయహే తెలంగాణ
- జిల్లా కవుల హర్షం



నిజామాబాద్ సిటీ: తెలంగాణ ఉద్యమానికి ఊపు నిచ్చి, ఉత్తేజం రగిల్చిన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' పాటను తెలంగాణ రాష్ట్ర గీతంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో హర్షం వ్యక్తమవుతోంది. ఈ పాటను వరంగల్ జిల్లాకు చెందిన తెలుగు కవి, సినీగేయ రచయిత అందెశ్రీ రాశారు. దీంతో అందెశ్రీకి సరైన గౌరవం దక్కిందని జిల్లా కవులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వరాష్ట్ర ఆకాంక్షను నింపిన ఈ గీతంపై పలువురు కవులు, రచయితలు 'సాక్షి'తో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

తెలంగాణకు ఇది గీతోదయం..



తెలంగాణ మలి ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లిన చైతన్య గీతం 'జయ జయహే తెలంగాణ' అందరికంటే ముందు ఎగిసిన వైతాళిక కవి అందెశ్రీ. ఈ పాట రాని గొంతు లేదు, ఈ పాట పాడని వేదికా లేదు. తెలంగాణకు ఇది గీతోదయం. ఇన్నాళ్లకు మా కవి హృదయాలు పులకించిపోయాయి.

– కాసర్ల నరేశ్‌రావు, ప్రముఖకవి, పాటల రచయిత

జయహో అందె శ్రీ



తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ ఇందూరు సభలలో తెలంగాణపై ప్రసంగిస్తూ ఎన్నో ఉత్తేజకరమైన పాటలు పాడారు. తెలంగాణ సాధనలో ఆయన పాత్ర అద్వితీయం, అసమాన్యం. 'జయ జయహే తెలంగాణ' పాటను రాష్ట్ర అధికార గీతంగా గుర్తించి ప్రకటించటం అభినందీయం. జయహో అందె శ్రీ.

– పంచరెడ్డి లక్ష్మణ్, కవి

పాఠ్యపుస్తకాలలో ముద్రించాలి



'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' పాటను రాష్ట్ర గీతంగా పాఠ్యపుస్తకంలో ముద్రించాలి. మలిదశ ఉద్యమంలో ఉద్యమ కారుల నిరంతర స్మరణగా మారింది. నిరసన కార్యక్రమాల్లో నేపథ్య సంగీతంలా ఆ పాట ప్రతిధ్వనించింది. ఇప్పుడు రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరం.

– ఘనపురం దేవేందర్, ప్రముఖ కవి

ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని..



రాష్ట్ర ఆవిర్భావానికి అందెశ్రీ రాసిన పాట ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణ జాతికి ప్రేరణనిచ్చిన వైతాళిక గీతం 'జయ జయహే తెలంగాణ' గీతం. ఈ గీతం ఇప్పుడు రాష్ట్రీయ గీతంగా ప్రకటించడం ఆనందంగా ఉంది. కవి అందెశ్రీకి అభినందనలు.

– వీపీ చందన్‌రావు, ప్రముఖ కవి

సంతోషంగా ఉంది



తెలంగాణ ఉద్యమ కవికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం గేయానికి ఎంతటి ప్రాధాన్యత ఉందో అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయానికి అంతటి ప్రాముఖ్యత ఉంది. మన రాష్ట్ర గీతంగా అధికారికంగా గుర్తింపు వచ్చినందుకు సంతోషంగా ఉంది.

– మల్లిగోడ గంగాప్రసాద్, జాతీయ కవి

తెలంగాణ గర్వించే గీతం..



జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించడం సంతోషంగా ఉంది. ఈ గీతంలో సాహితీ వేత్తలు, కళలు, పాలకుల ఘనత, జానపదుల సాహిత్యం గనుల వర్ణన అద్భుతం. ఈ గీతంలో మొత్తం తెలంగాణ చిత్రం చిత్రీకరించబడింది. అందెశ్రీకి హృదయపూర్వక అభినందనలు.

– పింగళి గంగాధర్‌రావు, కవి

వేదికలపై పాడాను



గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం కళాకారులను, ఉద్యమకారులను గుర్తిస్తోంది. అందెశ్రీ రాసిన పాటను నేను అనేక వేదికలపై పాడాను. ఈ గీతంలో అర్థాలు బాగున్నాయి. పదాల సాహిత్యం బాగుంది. అందెశ్రీ మూలాలు నందిపేట్, ఆర్మూర్, మాక్లూర్‌లో ఉన్నాయి.

– కె గంగాధర్, కవి, గాయకుడు, నందిపేట్

ప్రభుత్వ గుర్తింపు సంతోషకరం



తెలంగాణ ఉద్యమంలో ఎంతో ప్రాశస్త్యం పొందిన అందెశ్రీ రాసిన జయ జయహే గీతం సాహిత్యానికి దక్కిన గౌరవం. ఈ గీతాన్ని గత ప్రభుత్వం దొరహంకారంతో ఎందరు మేధావులు కోరినా నిర్లక్ష్యం చేశారు. ఉద్యమానికి ఊపిరిలూదిన ఈ గీతాన్ని ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉంది.

– ఎనిశెట్టి శంకర్, ప్రముఖ కవి

తెలంగాణ ఉద్యమం గుర్తుకొస్తుంది..



అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ పాట విన్న ప్రతిసారి తెలంగాణ ఉద్యమం గుర్తుకొస్తుంది. ఈ పాటకు అంతటి చరిత్ర ఉంది. రాష్ట్ర గీతంగా అందెశ్రీ పాడిన పాటను ప్రకటించడం ఎంతో ఆనందదాయకం. కవులను గుర్తిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు. అందెశ్రీకి అభినందనలు.

– శారదాహన్మాండ్లు, కవి

సమ్మె నోటీసు అందజేత

బాన్సువాడ : ఈ నెల 16న తలపెట్టనున్న దేశవ్యాప్త అంగన్‌వాడీ టీచర్ల సమ్మెకు సంబంధించిన నోటీసును ఐసీడీఎస్ సుపర్‌వైజర్ వాణికి అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఖలీల్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు అమలు చేసి యాక్టివిటీ ప్రకారం రూ.26 వేల వేతనం అందజేయాలని, పీఎఫ్ సౌకర్యంతోపాటు పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ, ఇంటి అద్దె, గ్యాస్ బిల్లులను అందజేయాలని కోరారు. డిసెంబర్ నెల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్త భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేశ్, అంగన్‌వాడీ టీచర్లు మహాదేవి, రేణుక, ఇందిరా, బాలమణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నాణ్యమైన విద్యను అందించాలి



మాచారెడ్డి : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మాచారెడ్డి కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటాచారి సూచించారు. మంగళవారం మాచారెడ్డి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ పాఠశాలల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాబోధన ఎలా చేయాలనే అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆంగ్ల మోడల్ పాఠాన్ని ఆంగ్ల ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ విద్య ఉపకరణాలు ఉపయోగించి ఎలా బోధించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ దేవ సంజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సన్మానం

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని తాజా మాజీ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, తహసీల్దార్ దశరథ్, ఎంపీవో సూర్యకాంత్, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి యూరియా కొరత లేదు



మహమ్మద్‌నగర్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి

నిజాంసాగర్(జుక్కల్): జిల్లాలో 3.45 లక్షల ఎకరాల్లో యాసంగి పంటలు సాగు చేశారని, పంటలకు అవసరమైన యూరియాను రైతులకు సరఫరా చేస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి తనిఖీ చేశారు. జిల్లాకు 40.28 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటిదాకా 42.29 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. ప్రాథమిక సహకార సంఘాలు, ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. యూరియా కొరత లేదన్నారు. జిల్లాలో 104 రైతు వేదికలకు ఉన్నాయని, రైతు వేదికల్లో రైతులకు శిక్షణ, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. మండల వ్యవసాయశాఖ ఏవో అమర్‌ప్రసాద్, ఫర్టిలైజర్ దుకణాల నిర్వహకులు జనార్దన్, కుమార్, వెంకటేశం, శివ, నరేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి



డీఈ కామేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మీటర్ రీడింగ్ ఆపరేటర్లు

బాన్సువాడ : పనికి తగిన వేతనం ఇవ్వాలని కోరుతూ మీటర్ రీడింగ్ ఆపరేటర్లు విద్యుత్‌శాఖ డీఈ కామేశ్వర్‌రావుకు మంగళవారం బాన్సువాడలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు రమేశ్ మాట్లాడుతూ.. తాము గత 20 ఏళ్లుగా విద్యుత్ మీటర్ రీడింగ్ ఆపరేటర్లుగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేయనున్న గృహజ్యోతి పథకంలో భాగంగా కరెంట్ బిల్లుతోపాటు సెల్‌ఫోన్, ఆధార్, రేషన్ కార్డు నంబర్లు లింక్ చేయాల్సి వస్తోందని, పని భారం పెరుగుతున్నదన్నారు. కరోనా సమయంలోనూ తాము ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించామని, తమను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మీటర్ రీడింగ్ ఆపరేటర్లు స్వామి, శివ, పుట్టి చిన్న సాయిలు, మనోజ్, సంతోష్‌రెడ్డి, వినోద్, గంగాధర్, వీరేశం తదితరులున్నారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని సాధించాలి

డిచ్‌పల్లి: జిల్లా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లో నిర్ణయించిన బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని గడువులోపు సాధించాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ లో మంగళవారం నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశానికి డీఆర్‌డీవో హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళలు, సంఘాల్లో సభ్యులుగా లేనివారిని గుర్తించి నూతన స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి లబ్ధి కలిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే 35 శాతం సబ్సిడీ రుణాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించిన మార్కెటింగ్ కమీషన్ 10 శాతం నిధులు రూ.21,97,485 ల చెక్కును డీఆర్‌డీవో జిల్లా సమాఖ్యకు అందజేశారు. అనంతరం ఎన్నిక నిర్వహించి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా ఈ.రాధ (ఆర్మూర్)ను ఎన్నుకున్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



కామారెడ్డి అర్బన్ : బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 8న పార్లమెంట్ ముట్టడి, 9న ఓబీసీ జాతీయ సభకు తరలిరావాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు పిలుపు నిచ్చారు. మంగళవారం పార్లమెంట్ ముట్టడి, జాతీయ ఓబీసీ మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి దయాకర్, ప్రతినిధులు మహేష్, అవినాష్, రాహుల్, మణికంఠ, సాయి కిరణ్, కృష్ణ, గణేష్, విష్ణు, రక్షిత్, అరవింద్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. కామారెడ్డిలో జూనియర్ న్యాయవాదిపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ వారు విధులను బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు నవీద్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పండరి, గోపాల్‌రావు, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులున్నారు.



కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

- మోర్తాడ్‌లో లభించిన బాలుడి ఆచూకీ
- తల్లిదండ్రులకు అప్పగింత

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతం నుంచి కిడ్నాపర్లు మూడేళ్ల బాలుడిని ఎత్తుకెళ్లగా.. రంగంలోకి దిగిన పోలీసులు కేసు ఛేదించారు. యాచకవృత్తి చేసుకునే వారు కంఠేశ్వర్ ప్రాంతంలో నిద్రిస్తుండగా, ఆదివారం రాత్రి కిడ్నాపర్లు మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు పోలీసులు బృందాలు రంగంలోకి దిగి విచారణ చేపట్టాయి. అయితే.. మోర్తాడ్ మండల పాలెం వరద కాలువ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బాలుడిని వదిలి వెళ్లారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని మోర్తాడ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది బాలుడిని జిల్లా కేంద్రానికి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న రూరల్ పోలీసులు

జీపీ సిబ్బంది సమాచారంతో..

మోర్తాడ్: మండలం కేంద్రంలోని వరదకాలువ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బాలుడిని మంగళవారం వదిలివెళ్లారు. బాలుడు ఏడవడంతో గమనించిన జీపీ సిబ్బంది వెంటనే పోలీస్, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- బాడ్సిలో ఓ ఇంటిపై దాడి



నిందితుడి అరెస్టును చూపుతున్న సీఐ సురేశ్‌కుమార్

మోపాల్: నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం బాడ్సిలో మంగళవారం పోలీసులు గ్రామానికి చెందిన ప్రసాద్ ఇంటిపై దాడి చేసి రూ.6.25 లక్షల విలువైన 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడిలో జరిగింది. అనంతరం పీఎస్‌లో ఎస్సై గంగాధర్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేసే కనుగుల ప్రసాద్ తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో ఆరు నెలలుగా గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడి చేయగా 5 సంచుల్లో గంజాయి లభించిందన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన గుణవంతు రావు నుంచి ప్రసాద్ గంజాయిని కిలో రూ.10 వేలకు కొని రూ.25 వేలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా బెంగళూరు, ఇతర రాష్ట్రాలకు గంజాయిని సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

లింగంపేటలో బైక్ చోరీ

లింగంపేట: మండల కేంద్రంలో ఓ బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన నారాగౌడ్ తన బైక్‌ను సోమవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గాంధారి: మండల కేంద్రానికి చెందిన చీమల్వార్ శ్రీకాంత్(29) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో శ్రీకాంత్ ఆదివారం గ్రామ శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన బంధువులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఒకరు..

సదాశివనగర్: మండలంలోని పద్మాజివాడి గ్రామానికి చెందిన ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామానికి చెందిన రాసి ఆశయ్య(69) ఈ నెల 4న జాతీయ రహదారి దాటుతుండగా నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఆశయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై రాజు మంగళవారం తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పో చారం చౌరస్తా 161 వ జాతీయ రహదారిపై మంగళవారం ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

పెద్దకొడప్‌గల్ మండలం తలాబ్‌తండాల్లో ఇంటి నిర్మాణం కోసం స్లాబ్ వేసేందుకు మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన వెంకటేశ్ శంబాజీ బన్సుడే(25), వాగ్మారే నిఖిల్ (20)తోపాటు సూర్యవంశీ సోమ్‌నాథ్ బైక్‌పై వస్తున్నారు. హైదరాబాద్ వైపు నుంచి వెళ్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే శంబాజీ బన్సుడే, నిఖిల్ ఇద్దరు మృతి చెందగా, బైక్‌పై ఉన్న మూడోవ్యక్తి సూర్యవంశీతోపాటు కారులోని మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికి త్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ నరేశ్ పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు నిఖిల్ తండ్రి వాగ్మారే యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా..



రాములు(ఫైల్)

సదాశివనగర్: మండల శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం టేక్రియాల్‌కు చెందిన చీకోటి బుగ్గ రాములు(53) సదాశివనగర్ మండలం కల్వరాల్‌లో అంత్యక్రియలకు హాజరై బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా సదాశివనగర్ శివారులో వెనుక నుంచి చెరుకు లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంగవ్వ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చర్చికి వెళ్లి వస్తుండగా..

ఆర్మూర్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి–జాతీయరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని పర్వతం తాతయ్య (60) అనే వృద్ధుడు మృతి చెందాడు. మలుగు జిల్లా ఏటూరు మండల కేంద్రానికి చెందిన ఆయన కొన్నేళ్లుగా మామిడిపల్లిలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం చర్చికి వెళ్లి వస్తుండగా రోడ్డు దాటే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు పోశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

- బాలిక మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

మద్నూర్: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ బాలిక మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. డోంగ్లి మండలంలోని లింబూర్‌వాడి గ్రామానికి చెందిన ఇద్దరు అన్నతమ్ముళ్లు రాజు, చందు మరో తమ్ముడు కుమార్తె అయిన సాన్వికతో కలిసి బైక్‌పై శుభకార్యం నిమిత్తం మద్నూర్‌కు సోమవారం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తడిహిప్పర్గా వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సాన్విక అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మద్నూర్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



సాన్విక (ఫైల్)